సాక్షి తిరుపతి

శనివారం । 29 । మార్చి । 2025



వెళ్లొస్తా అక్కా!

తూర్పు కనుపూరు ముత్యాలమ్మ జాతర అంగరంగ వైభవంగా ముగిసింది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. - IIలో



అంకుర సంస్థలకు గ్రాంట్స్

వ్యవసాయ, అనుబంధ రంగాల్లో కొత్త ఆవిష్కరణలకు మద్దతుగా అంకుర సంస్థలకు గ్రాంట్స్ విడుదల చేశారు. - IIలో



న్యూస్‌రీల్

పది సోషల్ పరీక్ష వాయిదా

తిరుపతి ఎడ్యుకేషన్: ఈ నెల 31వ తేదీన రంజాన్ పండుగ సందర్భంగా ఆ రోజు నిర్వహించాల్సిన సోషల్ స్టడీస్ పరీక్షను ఏప్రిల్ 1వ తేదీ నిర్వహించనున్నట్లు డీఈఓ కేవీఎన్.కుమార్ తెలిపారు.

సైన్స్ పరీక్షకు 720 మంది గైర్హాజరు

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా 164 పరీక్షా కేంద్రాల్లో బయాలాజికల్ సైన్స్ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు జనరల్, ప్రైవేటు విద్యార్థులు 27,141 మంది హాజరవ్వాల్సి ఉండగా వారిలో 583 మంది గైర్హాజరైనట్టు డీఈఓ తెలిపారు. అలాగే పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 17 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన సోషియల్ స్టడీస్ పరీక్షకు 958 మంది హాజరవ్వాల్సి ఉండగా వారిలో 137 మంది గైర్హాజరైనట్టు పేర్కొన్నారు.

అంగన్‌వాడీల్లో మెరుగైన సౌకర్యాలు



మదర్ ఫీడింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: అంగన్‌వాడీ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ, విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్ శాఖ రాష్ట్ర కార్యదర్శి సూర్య కుమారి వెల్లడించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఐసీడీఎస్ నేతృత్వంలో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ పాఠశాలల్లో తాగు నీరు, విద్యుత్ సౌకర్యం, టాయ్‌లెట్స్ నిర్వహణ వంద శాతం ఉండాలన్నారు. కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ పౌష్టికాహారాన్ని క్రమంతప్పకుండా అందించాలని చెప్పారు. అనంతరం కలెక్టరేట్‌లో మదర్ ఫీడింగ్ సెంటర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఆర్జేడీ స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారిణి రోహిణి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి వసంత బాయి, మహిళా డీఎస్పీ శ్రీలత, సహాయ సంచాలకులు పాల్గొన్నారు.



'1,1,1,2,2,2,3,3,3 ర్యాంకులు మావే..' అంటూ ఎక్కడో హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో విద్యార్థులు సాధించిన ర్యాంకులను తిరుపతిలో తమ సంస్థ సాధించిన విజయాలుగా చెప్పుకుంటూ చాలా మంది ప్రచారం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అపార్ట్‌మెంట్లు, కల్యాణ మండపాలు, ఇళ్లల్లో కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి లక్షలకు లక్షలు వసూలు చేస్తున్నారు. డిగ్రీలు పూర్తి చేసిన వారితో బోధన ఇప్పిస్తూ చీటింగ్‌కు పాల్పడుతున్నారు. వీటిపై ఎలాంటి నియంత్రణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటైన చీటింగ్ సెంటర్ల భాగోతంపై 'సాక్షి' స్పెషల్ ఫోకస్.



కోచింగ్.. చీటింగ్!

జిల్లాలో కోచింగ్ సెంటర్ల వివరాలు	
ఎంసెట్ కోచింగ్ సెంటర్లు	105
నీట్	76
పీజీ సెట్, ఐసెట్, ఈసెట్	45
నవోదయ, గురుకులం	50
ఐఏఎస్, ఏపీపీఎస్సీ, ఎస్సెస్సీ	55
రైల్వే, బ్యాంక్ కోచింగ్ సెంటర్లు	65
డీఎస్సీ కోచింగ్ సెంటర్లు	88
గ్రూప్స్, పోలీస్, ఆర్మీ కోచింగ్ సెంటర్లు	67
స్పోకెన్ ఇంగ్లిష్ సెంటర్లు	32
కంప్యూటర్ డిప్లొమో ట్రైనింగ్ సెంటర్లు	85
అబాకస్, బేసిక్ మ్యాథ్స్	12
సమ్మర్ కోచింగ్ ఫర్ టెన్త్, ఇంటర్	120
డాన్స్, యోగా, కల్చరల్ కోచింగ్	90
గేమ్స్ అండ్ స్పోర్ట్స్	135
ఆన్‌లైన్ కోచింగ్ సెంటర్లు (పోటీ పరీక్షలకు)	95
ఆన్‌లైన్ కోచింగ్ (ఎంసెట్, నీట్, పీజీ సెట్లకు)	125

- జిల్లాలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కోచింగ్ సెంటర్లు
- ఎంసెట్, నీట్, డీఎస్సీ కోచింగ్ అంటూ నిలువు దోపిడీ
- పేద విద్యార్థులే టార్గెట్‌గా ప్రచారం
- ఆన్‌లైన్, ఆఫ్ లైన్ శిక్షణ పేరుతో అడ్డగోలుగా వసూళ్లు
- కానరాని మౌలిక సదుపాయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

తిరుపతి సిటీ: ఉద్యోగం సాధించాలనే విద్యార్థుల ఆరాటం.. అమాయక తల్లిదండ్రుల ఆశలనే పెట్టుబడిగా కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు చెలరేగిపోతున్నారు. రోజుకో పేరుతో ఒక్కో రోజు ఒక్కో చోట బోర్డులు పెట్టి కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. తిరుపతి నగరంలోని ఎమ్మార్‌పల్లి సర్కిల్, ఎయిర్ బైపాస్ రోడ్డు, బాలజీ కాలనీ, భవానీనగర్, వీవీమహల్ రోడ్డు, అన్నారావు సర్కిల్, లీలామహల్ సర్కిల్ వంటి ప్రధాన ప్రాంతాలతో పాటు నగరంలో జనసంచారం అధికంగా గల వీధుల్లో సైతం కోచింగ్ సెంటర్లు నెలకొల్పుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం... కోచింగ్ సెంటర్ల ఇష్టారాజ్యం

అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం కారణంగా కోచింగ్ సెంటర్ల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఫీజుల విషయంలో స్పష్టత లేకుండా.. నిపుణులైన అధ్యాపకులతో బోధన చేయకుండా లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. కోచింగ్ సెంటర్‌లో కనీస మౌలిక వసతులు ఏర్పాటు చేయకుండా విద్యార్థులను ముప్పుతిప్పలకు గురిచేస్తున్నారు. ఫైర్ సేఫ్టీ టూల్స్, ఫస్ట్ ఎయిడ్ వంటి సౌకర్యాల మాట దేవుడెరుగు, కనీసం మంచినీటి సౌకర్యమూ కల్పించకుండా గొంతెండబెడుతున్నారు.

రూ.30 వేల నుంచి రూ.2 లక్షల వరకు వసూళ్లు



ఇంటర్ పరీక్షలు ముగిశాయి. ఎంసెట్, నీట్ వంటి ప్రవేశ పరీక్షల వైపు విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. అవకాశాన్ని క్యాష్ చేసుకునేందుకు కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఇంటింటా ప్రచారంతో పాటు సీటు గ్యారెంటీ ఆఫర్లతో రెచ్చిపోతున్నారు. షార్ట్ టర్మ్ కోచింగ్‌కు అయితే రూ.30వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల వరకు ముక్కుపిండి గుంజేస్తున్నారు. డీఎస్సీ, బ్యాంక్, రైల్వే, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు నుంచి పేరొందిన అధ్యాపకుల చేత ఉత్తమ శిక్షణ ఇప్పిస్తామంటూ ప్రగల్భాలు పలుకుతూ విద్యార్థులకు కుచ్చుటోపీ పెడుతున్నారు.

దారుణం



పేద విద్యార్థులను టార్గెట్ చేస్తూ అసాధ్యమైన ఫలితాలు సాధిస్తామంటూ కోచింగ్ సెంటర్ల యాజమాన్యాలు నమ్మబలికి తల్లిదండ్రుల కడుపు కొడుతూ అప్పుల పాలు చేస్తున్నాయి. అర్హత లేని అధ్యాపకులతో కోచింగ్ ఇవ్వడంతో పాటు ఒక్క కోచింగ్ సెంటర్లలోనూ మౌలిక సదుపాయాలు ఉండవు.

–శివశంకర్ నాయక్, జేఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, తిరుపతి

అనుమతులు లేనే లేవు



తిరుపతిలో వెలసిన వేల కోచింగ్ సెంటర్లకు అనుమతులు లేవు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడపడితే అక్కడ బోర్డులు పెట్టేస్తున్నారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థుల చేతనే జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సైతం కోచింగ్ ఇప్పిస్తున్నారు.

–ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి, తిరుపతి

తిరుపతిలో 2వేల కోచింగ్ సెంటర్లు



తిరుపతి నగరంలో సుమారు 2వేల కోచింగ్ సెంటర్లు ఉన్నాయి. నోటిఫికేషన్లు విడుదల గాకముందు నుంచే తమ కోచింగ్ సెంటర్‌లో ర్యాంకుల పంట పండిందంటూ తప్పుడు సమాచారంతో తల్లిదండ్రులను బుట్టలో వేసుకుంటున్నారు. నిపుణులైన అధ్యాపకులను నియమించకుండానే కాంపిటేటివ్ పరీక్షలకు కోచింగ్ ఇప్పిస్తున్నారు. కల్యాణ మండపాలను, అపార్ట్‌మెంట్లు, నివాస గృహాలలో మైకులు పెట్టి పుస్తకం చేతబట్టి చదువు చెబుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అధికారులు తనిఖీలు నిర్వహించాలి.

–ఆర్వీ చంద్రశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ అధ్యాపకులు, తిరుపతి

సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ ఉండరు



పోటీ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలంటే సబ్జెక్ట్‌లో తలపండిన నిపుణులు ఉండాలి. ఆధునిక పోటీ ప్రపంచంలో ర్యాంకులు సాధించాలన్నా, ఉన్నత స్థాయి ఉద్యోగాలను సాధించాలన్నా బోధన పద్ధతులు, నిపుణులైన అధ్యాపక బృందం అవసరం. కానీ ప్రస్తుతం కోచింగ్ సెంటర్లలో ఆపరిస్థితి లేదు.

–సూర్యనారాయణ, గతంలో పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చిన అధ్యాపకులు, తిరుపతి

పర్యవేక్షణ లేదు



కోచింగ్ సెంటర్లపై ప్రభుత్వాధికారులు దాడులు చేయాలి. అనుమతులు లేని కోచింగ్ సెంటర్లను వెంటనే రద్దు చేసి అపరాధం వేయాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే పోరుబాట తప్పదు

–హేమాద్రి యాదవ్, స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు, తిరుపతి

అదో చిన్న స్థానిక సంస్థ పదవి.. ఓ మండలానికే పరిమితం.. దాన్ని కైవశం చేసుకోవడానికి కూటమి నేతలు పలు అడ్డదారులు తొక్కారు.. కుట్రలు.. కుతంత్రాలు..కుయుక్తులు చేశారు. కూటమి ప్రజాప్రతినిధులు, బడా నేతలు చేసిన జుగుప్సాకర రాజకీయాలు జనానికి సైతం ఏవగింపు అనిపించాయి. మొత్తంగా వారి చేష్టలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశాయి.



రామకుప్పంలో అడ్డంకులు ఇలా..

ప్రజాస్వామ్యం.. అపహాస్యం

- ఆ నాలుగు గంటలు.. అడుగడుగునా ఆటంకాలు
- రోడ్డుకు అడ్డంగా చెట్లు నరికివేసి అడ్డుకునే ప్రయత్నం
- 20 నిముషాల ప్రయాణానికి 4 గంటలు ట్రాఫిక్ సమస్య సృష్టి

కుప్పం: మెజారిటీ ఎంపీటీసీ సభ్యులతో సంపూర్ణ ఆధిక్యత ఉన్న వైఎస్సార్‌సీపీని అడ్డుకునేందుకు టీడీపీ శతవిధాలా అడ్డదారులు తొక్కింది. ఎలాగైనా రామకుప్పం ఎంపీపీ స్థానాన్ని కైవశం చేసుకునేందుకు అధికార పార్టీ కుట్రలు కుతంత్రాలుచేసి, అధికారబలం ప్రదర్శించి, అడ్డుకుంది. ఆరుగురు ఎంపీటీసీలతో ఎంపీపీ ఎన్నికను ముగించారు.

కావేరీ జలాల కోసం ధర్నా డ్రామా

రామకుప్పం – వి.కోట మధ్య రాజుపేట రోడ్డు కర్ణాటక పరిధిలోకి వస్తుంది. వైఎస్సార్‌సీపీ ఎంపీ టీసీ సభ్యులు పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల నిర్వహణ కార్యాలయానికి తరలించే ప్రయత్నం చేశారు. వీరిని అడ్డుకునేందుకు రాజుపేట రోడ్డులో కావేరీ జలాలను తీసుకురావాలని ధర్నా డ్రామా ఆడారు. రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టి, చెట్లు నరికివేసి, ఒకటిన్నర గంట సమయం ట్రాఫిక్ సమస్య సృష్టించారు.

ఏకమైన అధికార పార్టీ క్యాడర్

రామకుప్పం ఎంపీపీ ఎన్నిక నిర్వహణపై ముందస్తుగా అధికార పార్టీ తెలుగుదేశం ప్రణాళిక రచించుకుంది. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు ఎక్కడ ఉన్నారో తెలుసుకుని, వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వి.కోట నుంచి వస్తుండగా అన్నవరం, కారుకుంట, చెల్దిగానిపల్లి, గంధారమాకులపల్లి ప్రతి గ్రామం వద్ద అడ్డుకునే ప్రయత్నం చేశారు. అనంతరం రాజుపేట రోడ్డు నుంచి రామకుప్పం వరకు చేపట్టిన ట్రాఫిక్ ధర్నాలతో ఎన్నికలకు హాజరు కానీయకుండా చేశారు.

అడుగడుగునా ఆటంకాలు

రామకుప్పం మండలంలో 16 మంది ఎంపీటీసీ సభ్యులకుగాను 8 మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఉన్నారు. టీడీపీకి ఆరుగురు ఉండగా ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. అధికార పార్టీ నేతలు బెదిరింపులు, ప్రలోభాలు పెట్టి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ శ్రేణు లు 8 మంది ఎంపీటీసీ సభ్యులను కర్ణాటకకు తరలించారు. అక్కడి నుంచి గురువారం ఉదయం వి.కోటలోని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు స్వగృహానికి తరలించారు. ఎంపీపీ ఎన్నిక కోసం 11 గంటలలోపు ఎంపీటీసీ సభ్యులు తమ ఓటుహక్కును వినియోగించుకోవాల్సి ఉంది. వి.కోట నుంచి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు రామకుప్పం బయలుదేరగా మార్గం మధ్యలో టీడీపీ శ్రేణులు అడుగడుగునా అడ్డుకున్నారు.

ఆ మూడుచోట్ల నిలిచారు.. గెలిచారు

- చిత్తూరు జిల్లాలోని సదుం, తవణంపల్లి, తిరుపతి జిల్లాలోని తిరుపతి రూరల్ మండల పరిషత్ అధ్యక్షులుగా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ నాయ కులు ఎన్నో విధాలుగా ప్రలోభాలకు గురిచేసినా వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు పార్టీకి విధేయులుగా నిలిచారు. ఏకగ్రీవంగా మండలాధ్యక్షులను ఎన్నుకున్నారు.
- తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని తిరుపతి రూరల్ మండలంలో మొత్తం 37 మంది ఎంపీటీసీలు ఉంటే, ఇద్దరు హాజరు కాలేదు. మిగిలిన 35 మందిలో 34 మంది వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచారు. ఒకే మాటపై ఉండి ఎంపీపీని గెలిపించుకున్నారు.

'సాక్షి' ఆధ్వర్యంలో ఉగాది పంచాంగ శ్రవణం

- 30న తిరుపతిలో ప్రత్యేక కార్యక్రమం



తిరుపతి కల్చరల్: సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో ఉగాది సంబరాలను అత్యంత వేడుకగా నిర్వహించనున్నారు. 'సాక్షి' అందిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమానికి ఏబీ ఎలక్ట్రానిక్స్ గౌరవ స్పాన్సర్‌గా, కో స్పాన్సర్‌గా అమిగోస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్, అన్నమాచార్య యూనివర్సిటీ, శుభమస్తు షాపింగ్‌మాల్, కెనరా బ్యాంకు సహకారం అందించనున్నాయి. ఈ ఉగాది వేడుకల్లో కళాత్మకమైన, తెలుగదనం ఉట్టిపడేలా కూచిపూడి నృత్యం, బాల బాలికలచేత సంప్రదాయ వస్త్రధారణ, తెలుగు పద్యాల పోటీలు, అవధానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రత్యేక పూజల అనంతరం పంచాంగ శ్రవణం చేపట్టనున్నారు. భవిష్యత్ మీకు ఏమి అందిస్తుందనే విషయాలను 'సాక్షి' పంచాంగం శ్రవణం ద్వారా తెలియజేయనున్నారు. ఈ సంప్రదాయ ఉగాది వేడుకల్లో ప్రజలందరూ పాల్గొనాలని ర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఎస్‌ఐ, కానిస్టేబుల్‌కు గాయాలు



ఎస్‌ఐని పరామర్శిస్తున్న ఎంపీడీఓ



గాయపడిన కానిస్టేబుల్ ప్రభాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తహానగర్ గ్రామంలో జగిరిన జాతరకు బందోబస్తుకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, కానిస్టేబుల్ ప్రభాకర్‌కు గాయా ల్రయ్యాయి. పోలీసుల కథనం.. మండలంలోని తహానగర్ గ్రామంలో గురువారం జాతర జరిగింది. జాతర బందోబస్తుకు ఎస్‌ఐ విశ్వనాథనాయుడు వెళ్లారు. ఆ తర్వాత రాత్రి 12 గంటల సమయంలో కానిస్టేబుల్ ప్రభాకర్‌తో కలసి బొలేరో వాహనంలో తిరిగి వస్తుండగా జీఎస్‌కండ్రిగ గ్రామం వద్ద వాహనానికి అడ్డంగా పంది రావడంతో వాహనం అదుపుతప్పి బొల్తా పడింది. ఎస్‌ఐ, కానిస్టేబుల్‌కు గాయాలవటంతో శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఎస్‌ఐని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనరు కొణతనేని మణినాయుడు, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు పరామర్శించారు.

పకడ్బందీగా పింఛన్ల పంపిణీ

తిరుపతి అర్బన్: ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను పకడ్బందీగా పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఆయన డీఆర్‌డీఏ పీడీ, లీడ్ బ్యాంక్ మేనేజర్, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, డీపీఓతోపాటు పలువురు అధికారులతో వర్చువల్‌గా మాట్లాడారు. ఏప్రిల్ 1న తొలి రోజే వంద శాతం పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

చిట్టమూరు: మండల పరిధిలోని దరఖాస్తు గ్రామానికి చెందిన బల్లి వెంకటయ్య(50) గురువారం ప్రమాద వశాత్తు చెరువులో పడి మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. గ్రామ చెరువు ఎగువన ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి పొంగళ్లు పెట్టేందుకు వెంకటయ్య బయలు దేరాడు. గ్రామస్తులందరూ కట్టపై వెళ్లగా వెంకటయ్య మాత్రం చెరువులో దిగి వెళ్లాడు. అనంతరం శుక్రవారం శవమై తేలాడు.



భక్త జనం మధ్య నిమజ్జనానికి తరలి వెళ్తున్న పోలేరమ్మ తల్లి

వెళ్లొస్తా అక్కా!

- ముగిసిన ముత్యాలమ్మ జాతర

చిల్లకూరు: చిల్లకూరు తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరు ముత్యాలమ్మ ఆలయంలో గత నాలుగు రోజులుగా జరిగిన జాతర శుక్రవారం ముగిసింది. పోలేరమ్మ సాగనంపిన తర్వాత కూడా ముత్యాలమ్మను దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. గంగమిట్ట మీద బుధవారం వేకువజామున కొలువుదీరిన పోలేరమ్మకు మూడు రోజుల పాటు భక్తులు పూజలు చేశారు. శుక్రవారం వేకువ జామున అమ్మవారికి ఏడు కుండల్లో వండిన అనాన్ని కుంభం పోశారు. అలాగే గణాచారికి ఊయల సేవ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పెద్దలు పోలేరమ్మ కథను ఆసాదుల ద్వారా వినిపించారు. పొలి అన్నాన్ని గ్రామ శివారు ప్రాంతాల్లో చల్లారు. చివరగా అమ్మవారి గుడి వద్దకు రాగానే పోలేరు తల్లి.. కరుణించమ్మా... జైపోలేరు అంటూ కేకలు వేస్తుండగా అమ్మవారి విగ్రహాన్ని తలపై మోసుకుంటూ గ్రామంలో ఊరేగింపుగా బయలు దేరారు. పోలేరమ్మ నిమ్మజనానికి బయలు దేరగా గణాచారి ముందు నడుస్తూ, పోలేరమ్మకు దారి చూపించారు. మహిళలు కొత్త బట్టలను దారిలో పరిచి వాటిపై సంతానం కోసం వరపడ్డారు.



ఊయల సేవలో గణాచారి

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

పోలేరమ్మ నిమ్మజనం అనంతరం ముత్యాలమ్మను శుక్రవారం గూడూరు, వెంకటగిరి ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, ప్రముఖ పారిశ్రామిక వేత్త గంగా ప్రసాద్, తానంకి నానాజీ తదితరులు దర్శించుకున్నారు.

అక్కా పోయి వస్తా!

ఏడాదికి ఒకసారి వచ్చే పోలేరమ్మ తన అక్కగా భావించే ముత్యాలమ్మకు వెళ్లి వస్తానని పలకరించే సన్నివేశాన్ని గణాచారి చెబుతుండగా అక్కడకు చేరుకున్న భక్తులు తన్మయత్వంతో పులకించిపోయారు. భక్తులు పొలి కేకలు పెట్టి పోలేరమ్మ తల్లికి జై.. అంటూ నినాదాలు చేశారు. అనంతరం గుడి వెనుక ఉన్న ద్వారంలో నుంచి పోలేరమ్మను ముత్యాలమ్మ ఆలయానికి కొంత దూరంలో ఉన్న జీడి మామిడి చెట్టు వద్దకు తీసుకెళ్లి నిమ్మజనం చేశారు.

గ్రా'మీన'రాబడి ఢమాల్!

తిరుపతి అర్బన్: జిల్లా వ్యాప్తంగా చెరువుల్లో చేపలు పట్టుకునే సీజన్ మొదలైంది. ఈ క్రమంలో మత్స్యశాఖ పరిధిలోని చేపల చెరువులను నామమాత్రపు ధరకు మత్స్యశాఖ అధికారులు సొసైటీలకు, గ్రామ పంచాయతీలకు కట్టబెడుతున్నారు. రూ.4 వేల నుంచి రూ.1.75 లక్షల వరకు చేపల చెరువు విస్తీర్ణాన్ని బట్టి విక్రయిస్తున్నారు. శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు చెరువును రూ.1.75 లక్షలకు సొసైటీకి అప్పగించారు. ఇప్పటి వరకు 134 చెరువులను రూ.18.66 లక్షలకు అప్పగించారు. మరో 20 రోజుల్లో అన్ని చెరువులను సొసైటీలకు లేదా పంచాయతీలకు కట్టబెట్టనున్నారు. జిల్లాలో 100 సొసైటీలు ఉన్నాయి. అందులో 4,200 మంది సభ్యులున్నారు.

రాబడిని పెంచరే?

రాబడి పెంచే దిశగా మత్స్యశాఖ అధికారులు పనిచేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చెరువుల్లో చేపలను ప్రతి ఏటా నవంబర్ లేదా డిసెంబర్ నెలల్లో వదిలిపెట్టాలి. ఈ ఏడాది ఫిబ్రవరిలో 66 సొసైటీ చెరువులకు మాత్రమే 30 లక్షల చేప పిల్లలను వదిలిపెట్టారు. గతంలో కోటి చేప పిల్లలను 100కు పైగా చెరువుల్లో వదిలిపెట్టేవారు. సొసైటీ చెరువుల్లోనే కాకుండా పంచాయతీ రాజ్ చెరువుల్లోనూ చేప పిల్లలను వదిలి పెట్టేవారు. దీంతో అధిక మొత్తానికి చెరువులను విక్రయించేవారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు.



జిల్లా మత్స్యశాఖ కార్యాలయం

ఒక్కో చెరువును అప్పగిస్తున్నాం



చేపల చెరువులను ఒక్కొక్కటిగా సొసైటీలకు, పంచాయతీలకు అప్పగిస్తున్నాం. మేము అప్పగించే చెరువుల ద్వారా వచ్చే రాబడిలో 30శాతం పంచాయతీలకు ఇవ్వాల్సి ఉంటుంది. 50శాతం ఆయకట్టుకు చెల్లించాలి. 20 శాతం రాబడి మాత్రమే మత్స్యశాఖకు చెందుతుంది.

–నాగరాజు, జిల్లా మత్స్యశాఖ అధికారి

తిరుమలలో మద్యం బాటిళ్లు

తిరుమల: తిరుపతి నుంచి తిరుమలకు మద్యం అక్రమ రవాణాపై పోలీసులు, విజిలెన్స్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం తిరుమలలో స్థానికులు నివాసం ఉండే బాలాజీ కాలనీలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పలు ఇళ్లల్లో మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. వీటిని స్థానికులు తిరుపతి అలిపిరి చెక్‌పోస్టు సిబ్బంది కన్నుగప్పి తిరుమలకు తీసుకొచ్చినట్టు గుర్తించారు. సంబంధిత వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు.



తిరుమలలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న పోలీసులు

జగనన్న పాలనలోనే ముస్లింల అభ్యున్నతి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట పట్టణంలోని పెద్ద మసీద్ వద్ద శుక్రవారం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పేద ముస్లిం మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. ముందుగా ఆయన్ను ముస్లిం, మైనారిటీలు ఆత్మీయంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలోని ముస్లిం, మైనారిటీలందరికీ ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో జగనన్న పాలనలోనే ముస్లిం మైనారిటీలు అభివృద్ధి చెందారని గుర్తు చేశారు. 9 నెలల కాలంలోనే ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రసూల్, సర్పంచ్ నగేషం, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, ముస్లిం మైనారిటీ పట్టణ అధ్యక్షుడు రఫీ ఉల్లా, మండల కార్యదర్శి షబీర్ అహ్మద్, డాక్టర్ బాబు, సయ్యద్ ఆలీ పాల్గొన్నారు.



ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

చంద్రగిరి: అక్రమంగా డంప్ చేసిన ఎర్ర చందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండల పరిధిలోని శ్రీనివాసమంగాపురం సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఎర్ర చందనం దుంగలు డంప్ చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సీఐ సుబ్బరామిరెడ్డి తన సిబ్బందితో కలసి ఏ గ్రేడ్‌కు చెందిన 6 ఎర్ర చందనం దుంగలను గుర్తించారు. అనంతరం వాటిని సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు. స్వాధీనం చేసుకున్న దుంగలు 182 కిలోల బరువున్నట్లు తెలిపారు. అనంతరం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసినట్లు ఆయన తెలిపారు.



ఎర్రచందనం దుంగలను పరిశీలిస్తున్న సీఐ సుబ్బరామిరెడ్డి

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 64,279 మంది స్వామివారిని దర్శించుకోగా 24,482 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.36 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

బడ్జెట్‌పై అవగాహన

శ్రీసిటీ (వరదయ్యపాళెం): కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన కేంద్ర పరోక్ష పన్నులు, సుంకాల మండలి, భారత పరిశ్రమల సమాఖ్య, శ్రీసిటీ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర వార్షిక బడ్జెట్, పన్నులు, ఆడిటింగ్ పై శ్రీసిటీలో అవగాహన సమావేశం జరిగింది. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆడిట్ కమిషనర్ పీ. ఆనంద్‌కుమార్, ఐఆర్ఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పరిశ్రమలకు తాజా పన్నుల విధానం, అనుగుణ్యత మార్గదర్శకాలు, కేంద్ర బడ్జెట్ ప్రభావం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు ఆనంద్ కుమార్‌కు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆనంద్ కుమార్ తయారీ పరిశ్రమలు, సేవలందించే సంస్థల ఆడిటింగ్ విధానాలు, అలాగే ఆధునిక సాంకేతికతల వినియోగం ద్వారా సమర్థత పెంపు వంటి పలు అంశాలపై ప్రసంగించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆర్‌ఏ.మాలతి మాట్లాడుతూ ప్రస్తుత బడ్జెట్‌లో వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, అంతర్గత జలమార్గాలు తదితరాలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలను వివరించారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఆడిట్ కమిషనర్ ఆనంద్ కుమార్, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

ఫ్యాప్టో నూతన చైర్మన్‌గా సురేష్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని యూటీఎఫ్ భవన్‌లో శుక్రవారం ఫ్యాప్టో తిరుపతి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా ఫ్యాప్టో నూతన చైర్మన్‌గా ఏపీటీఎఫ్–1938 నాయకులు ఎస్.సురేష్ ఎన్నికయ్యారు. అలాగే బీటీయే నుంచి జె.వెంకట్రావు ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శిగా, హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు కె.వెంకటరమణ ఫ్యాప్టో కోచైర్మన్‌గా ఎన్నికయ్యారు.



ఫ్యాప్టో జిల్లా నూతన చైర్మన్, ప్రధాన కార్యదర్శులు సురేష్, వెంకట్రావు

పనపాకంలో బోగస్ సర్టిఫికెట్ల జాతర

- చక్రం తిప్పుతున్న అధికార పార్టీ నాయకుడు, రుయా ఉద్యోగి

చంద్రగిరి: చంద్రగిరి మండలం, పనపాకం పంచాయతీ కేంద్రం బోగస్ వికలాంగ సర్టిఫికెట్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. స్థానిక అధికార పార్టీ నాయకుడు, అదే గ్రామానికి చెందిన రుయా ఉద్యోగి ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. మండలంలో ఎవరికైనా వికలాంగుల సర్టిఫికెట్ కావాలంటే ఆయనగారిని కలిసి రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు డబ్బులు ముట్టజెబితే చాలు బోగస్ వికలాంగుల సర్టిఫికెట్ ఇస్తారన్న ప్రచారం మండలంలో జోరుగా సాగుతోంది. వీరిని కాదని సదరంలో దరఖాస్తు చేసుకుని రుయాకు వెళ్లినా సర్టిఫికెట్ మంజూరు కాదని పనపాకం పంచాయతీ ప్రజలు బాహాటంగా చెబుతున్నారు. ఆ నేతతో పాటు రుయా ఉద్యోగికి నగదు ముట్టజెబితే జీరో పర్సెంట్ వికలాంగుడైన పెన్షన్ పొందేందుకు సర్టిఫికెట్‌ను ఇప్పిస్తారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది.

నకిలీ సర్టిఫికెట్లపై విచారణ

ఇటీవల పనపాకం పంచాయతీలో అధికారులు బోగస్ సర్టిఫికెట్లపై విచారణ చేపట్టారు. గ్రామంలో 90 మంది వికలాంగుల పెన్షన్లు ఉంటే అందులో సుమారు 80 మంది పింఛన్‌దారులు బోగస్ సర్టిఫికెట్లు పొందినట్టు అధికారులు గుర్తించారు.



బలహీన వర్గాలనూ వదలడం లేదు

పింఛన్ల బాగోతమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీలకు 45 ఏళ్లకు పెన్షన్లు మంజూరు చేస్తామని చెప్పడంతో ఈ సామాజిక వర్గాలకు చెందిన వారి నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు స్థానికంగా చర్చసాగుతోంది. బలహీన వర్గాల వారి నుంచి కుల ధ్రువీకరణ పత్రాలను తీసుకుని ఒక్కొక్క పింఛనుకు రూ.5వేల వరకు ఇవ్వాలంటూ వారి వద్ద నుంచి సర్టిఫికెట్లను సేకరించి పెట్టుకున్నారని సమాచారం. ఇలాంటి వాటిపై సమగ్ర విచారణ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రాయంచపై రామచంద్రమూర్తి



హంస వాహనంపై కోదండరాముడు

తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం రాత్రి హంస వాహనంపై శ్రీరామచంద్రమూర్తి విహరించారు. గజరాజులు ముందు కదులుతుండగా, భక్తజన బృందాల భజనలు, మంగళవాయిద్యాల నడుమ వాహన సేవ కనులపండువగా సాగింది. ఈ క్రమంలోనే ఉదయం స్వామి వారు చిన్నశేష వాహనపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అనంతరం దేవదేవేరులకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు.

యువకుడికి బతికున్నంత వరకు జైలు

చిత్తూరు అర్బన్: పెళ్లి పేరిట మైనర్ బాలికను లొంగదీసుకుని.. ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డ కేసులో కె.దినేష్ (25) అనే నిందితుడికి బతికున్నంత వరకు జైలుశిక్ష విధిస్తూ చిత్తూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి శాంతి శుక్రవారం తీర్పునిచ్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహన్‌కుమారి కథనం మేరకు.. గుడిపాల మండలం చిత్తపారకు చెందిన దినేష్ తిరుపతి నగరంలోని మంగళం వద్ద ఉంటూ ప్రైవేటు కంపెనీలో పనిచేసేవాడు. ఇతనికి చిత్తూరు నగరానికి చెందిన 17 ఏళ్ల బాలికతో పరిచయమైంది. 2022 జనవరి 31 అర్ధరాత్రి బాలిక ఇంటికి వద్దకు వెళ్లి, ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పి తీసుకెళ్లిపోయాడు. ఆమెను తన స్నేహితుడి ఇంటికి తీసుకెళ్లి తన లైంగికవాంఛ బయపెట్టగా, బాలిక అంగీకరించలేదు. దీంతో కూల్‌డ్రింక్‌లో మత్తు పదార్థం ఇచ్చి బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను పెళ్లి చేసుకున్నాడు. అప్పటికే తమ కుమార్తె కనిపించడంలేదని బాలిక తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తొలుత బాలిక కనిపించడం లేదని కేసు నమోదు చేసిన పోలీసులు, ఆపై బాలిక ఆచూకీ కనిపెట్టి, విచారించగా జరిగిన ఘటన గురించి చెప్పింది. దీంతో నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నేరం రుజువు కావడంతో దినేష్‌కు ఐపీసీ 235 (2) సెక్షన్ కింద ఏడేళ్ల జైలుశిక్ష, బాలికను కిడ్నాప్ చేసినందుకు ఏడాది జైలుశిక్ష, బాలికపై లైంగికదాడికి పాల్పడినందుకు పోక్సోలోని 3 (ఏ), 4 ప్రకారం బతికున్నంత వరకు జైలుశిక్ష, రూ.2 వేలు జరిమానా, బాల్య వివాహ నిషేధిత చట్టంలోని సెక్షన్ 9 కింద రెండేళ్ల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు ఆన్‌లైన్‌లో నమోదు

తిరుపతి కల్చరల్: ఇండియన్ ఆర్మీ రిక్రూట్ మెంట్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సెట్విన్ సీఈవో కె.మోహన్‌కుమార్ తెలిపారు. ఇండియన్ ఆర్మీలో అగ్నివీర్(జనరల్ డ్యూటీ–టెన్త్ ఉత్తీర్ణత), అగ్నివీర్ (టెక్నికల్–ఇంటర్ లేదా, ఐటీ లేదా పాలిటెక్నిక్ ఉత్తీర్ణత), అగ్నివీర్ (క్లర్క్, స్టోర్ కీపర్‌కు(ఇంటర్ లేదా ఐటీఐ, పాలిటెక్నిక్ ఉత్తీర్ణత అయిన వారు అర్హులని పేర్కొన్నారు. అలాగే అగ్నివీర్ (ట్రేడ్‌మెన్–8 నుంచి 10వ తరగతి ఉత్తీర్ణత అయిన వారు అర్హులని తెలిపారు. ఈ పోస్టుల నియామకానికి చెన్నై జోన్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ మార్చి 12 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు యువతీ యువకులు తమ అర్హత కలిగిన విభాగాలకు దరఖాస్తును www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. 8వ తరగతి నుంచి ఇంటర్ పాస్ అయి ఉండి 17 నుంచి 21 ఏళ్లలోపు వయస్సు కలిగిన యువతీ యువకులు 2004 అక్టోబర్ 1 నుంచి 2008 ఏప్రిల్ 1వ తేదీ లోపు పుట్టిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నవారికి మాత్రమే రిక్రూట్ మెంట్ ర్యాలీలో పాల్గొనే అర్హత ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 0877–2286921, 9440573537, 7036428762లను సంప్రదించాలని తెలియజేశారు.

అంకుర సంస్థలకు గ్రాంట్స్

తిరుపతి సిటీ: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పోషణ ఇంక్యుబేటర్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో కొత్త ఆవిష్కరణలకు మద్దతుగా అంకుర సంస్థలకు గ్రాంట్ పంపిణీ చేశారు. శుక్రవారం ఆర్‌ఏఆర్‌ఎస్ వేదికగా జరిగిన కార్యక్రమానికి వీసీ శారదా జయలక్ష్మి, పరిశోధన విభాగం డైరెక్టర్ సత్యనారాయణ వర్చువల్ విధానంలో పాల్గొని అర్హులకు గ్రాంట్ నిధులు పంపిణీ చేశారు. వారు మట్లాడుతూ వ్యవసాయ రంగంలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు పోషణ ఇంక్యుబేటర్ అగ్రగామిగా నిలుస్తోందన్నారు. అనంతరం అర్హులైన మొత్తం 20 స్టార్టప్‌లకు గ్రాంట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ వీ.సుమతి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కదిరిమోహన్, స్టార్టప్ ప్రతినిధులు పాల్గొన్నారు.



గ్రాంట్స్ పొందిన స్టార్టప్ ప్రతినిధులతో ఏడీఆర్ సుమతి, శాస్త్రవేత్తలు

తమిళనాడుకు గంగ నీరు

సత్యవేడు: తమిళనాడుకు గంగ నీటిని ఆంధ్ర–తమిళనాడు అధికారులు విడుదల చేశారు. శుక్రవారం తెలుగు గంగ ఈఈ సుబ్బరత్నారెడి, తమిళనాడు నీటిపారుదలశాఖ ఏఈ సతీష్, సిబ్బంది కలసి గంగనీటిపై పుష్పాలు చల్లి నీటిని విడుదల చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి గంగ ఈఈ సుబ్బరత్నారెడ్డి మాట్లాడుతూ చెన్నై వాసుల దాహార్తిని తీర్చడానికి గంగనీటిని విడుదల చేశామన్నారు. మండలంలోని తొండుకుల్లి సమీపంలో గల జీరో పాయింట్ వద్ద ప్రస్తుతం 0.32 సెం.మీ లోతు 52 క్యూసెక్కుల ప్రవాహ వేగంతో గంగ పరవళ్లు తొక్కుతున్నట్టు వెల్లడించారు. గంగ డీఈ శ్రీహరి, ఏఈఈలు వెంకటేశులు, హహేష్ పాల్గొన్నారు.

తమిళనాడుకు చేరిన కండలేరు జలాలు

రాపూరు: కండలేరు హెడ్‌రెగ్యులేటర్ నుంచి విడుదల చేసిన జలాలు శుక్రవారం తమిళనాడు బార్డర్‌లో పూండికి చేరినట్లు తెలుగుగంగ అధికారులు తెలిపారు. చెన్నై నగర ప్రజలకు తాగు నీటి అవసరాల నిమిత్తం కండలేరు హెడ్‌రెగ్యులేటర్ నుంచి 500 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేసినట్లు అధికారులు వివరించారు. ఈ నీరు శుక్రవారం తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన పూండి గ్రామానికి చేరాయని పేర్కొన్నారు.



జీరో పాయింట్ వద్ద నీటిని విడుదుల చేస్తున్న అధికారులు